క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి



ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని పోతులబోగూడలో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. గాలి అనిల్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, రైతుబంధు మాజీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బస్వరాజ్, లింగాగౌడ్, మాణిక్‌రెడ్డి, వెంకటేశం, ఎల్లయ్య పాల్గొన్నారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగ జడ్జి 15మందికి ఒక్కొక్కరికి రూ.100 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

వికలాంగులను ఆదుకుందాం

సంగారెడ్డి టౌన్: ప్రతిఒక్కరూ వికలాంగులను ఆదుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని లలిత కుమారి అన్నారు. ఎన్పీఆర్డీ సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను సంగారెడ్డిలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, వికలాంగులు అన్ని రంగాల్లో రాణించేవిధంగా అందరూ ప్రోత్సహం అందించాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య, జిల్లా నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: ఓటుహక్కుతోనే యువత భవిష్యత్ ముడిపడి ఉంటుందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా వలంటీర్ అజయ్‌యాదవ్, రుద్రారం ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు షేరిపుద్దిన్ అన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతపై ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైనవారందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేతకీ హుండీ ఆదాయం లెక్కింపు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని భక్తులు సమర్పించుకున్న నగదును పార్వతీపరమేశ్వరులకు పూజలు చేసి లెక్కింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ రూ.14,56,956 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

హత్నూర(సంగారెడ్డి): కాన్షీరాం 90వ జయంతిని బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం తన జీవితాన్ని అంకితం చేసి అనునిత్యం బహుజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన కాన్షీరాం త్యాగం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి తాళ్ల జనార్దన్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, జిల్లా నాయకులు సత్యం, యాదగిరి, కాసాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



ప్రవీణ్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సృజనలక్ష్మీనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ ఎప్పటిలాగే ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి రాలేదు. దీంతో అతడి భార్య స్వప్న ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కళావిహీనం.. తహసీల్దార్ కార్యాలయం

- పర్యవేక్షణ కరువై ఎండుతున్న చెట్లు
- బోరుమోటారు ఉన్నా నీళ్లు అందించని వైనం
- పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎండిపోయిన చెట్లు, మొక్కలు



పిచ్చిమొక్కల మధ్యన బోరుమోటారు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెట్లు, మొక్కలు ఎండిపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో చెట్లకు నీరు పోసేవారు కరువయ్యారు. పచ్చదనంతో కళకళలాడాల్సిన కార్యాలయం.. ఎండిన చెట్లు, మొక్కలతో కళావిహీనంగా కనిపిస్తోంది. రాలిన చెట్ల ఆకులను కూడా తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉంది. గతంలో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర అధికారులు పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించారన్న గుర్తింపు ఉండగా ప్రస్తుత అధికారులు చెట్లు, మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

నీటి సౌకర్యం ఉన్నా.. పట్టించుకోని అధికారులు

తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పచ్చని గడ్డిని పరిచారు. పశువులు మొక్కలను తినకుండా చుట్టూ పెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా మొక్కలకు నీరు అందించడానికి బోరు వేసి సింగల్ ఫేజ్ మోటారు అమర్చారు. దీంతో క్రమం తప్పకుండా నీరు పోయడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆ తరువాత వచ్చిన అధికారులు మొక్కలను కాపాడుకుంటూ వచ్చారు. కొన్ని నెలలుగా చెట్లు, మొక్కలు సంరక్షణను పట్టించుకోకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది స్పందించి చెట్లు, మొక్కలకు నీరుపోసి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తగిన సిబ్బంది లేని కారణంగా నీరు పెట్టడంలేదని, గతంలో వీఆర్ఏలు మొక్కలు ఎండిపోకుండా చూసేవారని సమాధానం ఇచ్చారు. ఇక నుంచి కార్యాలయ ఆవరణలోని చెట్లు, మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేశ ఖండన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేశ ఖండన చేయిస్తున్న రాజు దంపతులు

జోగిపేట(అందోల్): అందోలు మున్సిపాలిటీకి చెందిన తూప్రం రాజు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట తన కుమారుడి కేశ ఖండనను శుక్రవారం నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం గడిపే రాజుకు అంబేడ్కర్‌పై అభిమానంతో తనకున్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకోవడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. దేవాలయాల్లో, చర్చిలో, దర్గాలో కేశ ఖండన చేసే స్తోమత తనకు లేదని, అందుకే మహానుభావుడు అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సమాధానం ఇచ్చాడు. పలువురు స్థానికులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించి రాజును అభినందించారు. కార్యక్రమంలో ఆందోల్ అంబేడ్కర్ సంఘం నాయకులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శంకర్‌పాటిల్

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్ పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.8లక్షల నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీకి సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌గా లకోష్మరెడ్డిని ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీకి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సభ్యులు డాకయ్యసాగర్, రవీందర్‌గౌడ్, గంగమ్మ, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మల్లారెడ్డి, శివనందం, ప్రభు, రామచంద్రారెడ్డి, అశోక్, రవీందర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జుజాల్‌పూర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సమష్టి కృషి, సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మండల పరిధిలోని జుజాల్‌పూర్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గడ్డతండా, కాంజీపూర్, పలుగుతండా, హంగర్గా(కె), హంగర్గా(బి), హుక్రానా(జి), చాప్టా(కె), సంజీవన్‌రావుపేటలలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, దత్తుగౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధంగా పశుపోషణ మేలు

రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపడితే మరింత మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ పాలశీతలీకరణ కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు పాల ఉత్పత్తి, నాణ్యతపై అవగాహన కల్పించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ మెదక్, సంగారెడ్డి జిల్లాల ఉపసంచాలకులు శ్రీనివాస్, మోహనమురళీ, ఖేడ్, జహీరాబాద్ పాలశీతలీకరణ కేంద్రాల మెనేజర్లు రాములు, డేవిడ్‌రాజు, జూనియర్ మెనేజరు రంజిత్, పశువైద్యాధికారి నేతాజీ, స్థానిక ఎస్‌బీఐ మెనేజర్ నవీన్, పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షుడు నాగంజీవన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు. అనంతరం ర్యాకల్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుంద ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా స్వాతి, డీఈఓగా ఐశ్వర్య, ఎంఈఓగా రాకేష్, ప్రధానోపాధ్యాయులుగా అంజలి, ఆనంద్, కుశాల్, పరమేశ్వర్, మమత, అశ్విని, అభిరామ్‌లు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్ఎం సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

జహీరాబాద్ టౌన్: గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఈ నెల 10 తేదీన రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఎరుకలి లక్ష్మన్న పాటు ఆయన చిన్న కోడలు సుగుణమ్మ, మనుమరాలు కీర్తి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మన్న శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌కు సన్మానం



బసవేశ్వరుడికి పూజల్లో పాల్గొన్న సురేష్ షెట్కార్, లింగాయత్ సమాజ్ సభ్యులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో లింగాయత్ సమాజ్ నాయకులు సన్మానించారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలోని బసవ మంటపంలో శుక్రవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్ మాట్లాడుతూ విశ్వగురువు బాటలో నడుస్తూ లింగాయత్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుకు సురేష్‌షెట్కార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అదేవిధంగా వీరశైవ లింగాయత్‌లు బీసీ(డీ) గ్రూపులో చేర్చడానికి అప్పట్లో చాలా కష్టపడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప, నారాయణఖేడ్ ఇన్‌చార్జి బిరాదర్ నాగేష్, నాయకులు యశ్వంత్‌రావు, కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సురేష్ షెట్కార్ బసవ మండపంలో బసవేశ్వరుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్యలు తలెత్తవద్దు

- ఎంపీపీ దేవదాసు
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

ఝరాసంగం(జహీరాబాద్): ఎంపీపీ దేవదాసు అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీఓ సుధాకర్ ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తుండటంతో గ్రామాల్లో ప్రధానంగా తాగునీటి సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు.

సమస్యల పరిష్కారంపై సభ్యుల నిలదీత

మండల పరిధిలోని మేదపల్లి, ఈదులపల్లి గ్రామాల్లో గత పదేళ్లగా మంజీరాతో పాటు మిషన్ భగీరథ ద్వారా చుక్కనీరు కూడా రాలేదని, ప్రైవేటు వాటర్ ట్యాంకర్లను అద్దెకు తీసుకుని గ్రామ పంచాయతీ ద్వారా బిల్లులు చెల్లించి తాగునీరు సరఫరా చేస్తున్నామని ఈదులపల్లి ఎంపీటీసీ శంకర్‌పాటిల్ అధికారుల తీరును ఎండగట్టారు. అదేవిధంగా చాలా గ్రామాల్లో నేటికీ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు రావటంలేదని సభ్యులు వాపోయారు. రాఘవపూర్‌లో ఏర్పాటు చేసిన మిషన్‌లు తరచూ పాడవడటంతోనే సమస్య వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఈదులపల్లి గ్రామ శివారులోని చెరువుకు ఫీడర్ ఛానెల్‌ను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. బర్దీపూర్-మాచ్నూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ఎంపీటీసీ రాజు సభలో ప్రస్తావించారు. మండలంలోని ఈదులపల్లి గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ నియమించినా గ్రామానికి రావటంలేదని తెలిపారు. అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేయగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మల్లన్నపాటిల్, ఎంపీటీసీలు శంకర్‌పాటిల్, రాజు, ఉమావతిమారుతిరావు పాటిల్, కో–ఆప్షన్ సభ్యుడు ఇక్బాల్ జానీ, అధికారులు సంజీవరావు, లక్ష్మయ్య, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్, సునీల్‌దత్త్, రమ్య, బాలకృష్ణ, సృజన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివశతకం పుస్తకావిష్కరణ

నారాయణఖేడ్: సాహితి మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ వడ్ల రాజయ్య రచించిన, శ్రీశివశతకం అష్టోత్తర శతకవుల పద్య సంకలనం పుస్తకాన్ని శుక్రవారం ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. అదేవిధంగా మిత్రమండలి ప్రధాన కార్యదర్శి భూమయ్య రచించిన మా పద్య మణిహారం, సమస్య పురాణం, అవధాని బండికాడి అంజయ్య రచించిన సైనిక విజయం పుస్తకాలను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, రసగీతి సాహితి సంస్థ అధ్యక్షుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి, అష్టావధానులుశంకరయ్య, తల్లోజు యాదవాచార్యులు, బానుప్రకాష్, మిత్రమండలి బాధ్యులు మారుతి, జగదీశ్వర్, నాగభూషణం, మహేందర్, చంద్రకాంత్, కవులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విరాళాలు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో నిర్మిస్తున్న జ్యోతిర్లింగ శివాలయానికి శుక్రవారం జిన్నారంలోని అంబే జ్యూవెలర్స్ యజమాని ప్రకాశ్ రూ.35వేలు, బాలాజీ స్టీల్ హోమ్ నీడ్స్ యజమాని రూ.25వేలు, అయిమాత జ్యూవెలర్స్ యాజమాని రాకేష్ రూ.21వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల యజమానులకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఉపాధిహామీ పథకం ద్వారా రూ.10లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

◆ పరీక్షాప్యాడ్‌లు పంపిణీ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని గొంగులూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్, నాగేష్‌గౌడ్ పరీక్షాప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంగప్ప, ఉపాధ్యాయులు బాబూరావు, పీఈటీ నాగగౌడ్ పాల్గొన్నారు.

◆ క్షతగాత్రులకు పరామర్శ

హత్నూర (సంగారెడ్డి): ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఒకరు మిన్పూర్ గ్రామానికి చెందిన మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ క్రమంలో అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి గమనించి క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలింపజేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఫోన్‌లో డాక్టర్లకు సూచించారు.

◆ ఘనంగా కృతిక నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనతో పాటు లలితా సహస్ర పారాయణం చదివారు. అనంతరం పల్లకీ సేవా నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

◆ సాహితి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సంగారెడ్డి: పట్టణంలోని రైతుబజార్ ఎదురుగా ఉన్న సాహితి హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత న్యూరో, డయాబెటిక్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బీఎస్ రెడ్డి, డయాబెటిక్ వైద్య నిపుణులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ ఘనంగా బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శుక్రవారం శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్, శ్రీసాయినగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ టీకాలు వేయించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): గాలి కుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి అజింక్యా పశు పోషణాదారులకు సూచించారు. మండలంలో ఈ నెల 15 నుంచి 31వ వరకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని గంగ్వార్‌లో ఎంపీపీ అంజమ్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంఏ ఘనీ తదితరులు పాల్గొన్నారు.

◆ మహీంద్ర అకాడమీ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో మహీంద్ర అకాడమీ 26వ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహీంద్ర అండ్ మహీంద్ర అకాడమీ చైర్మన్ షీతల్ మెహతా, మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ హెడ్ సీతారాం, అకాడమీ కరస్పాండెంట్ బాలపరమేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహీంద్ర అకాడమీలోచదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

◆ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల సంఘం డైరీతో పాటు ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అల్లంరెడ్డి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చయ్య, కళాశాల యూనిట్ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి రవీందర్, కోశాధికారి డాక్టర్ జీనారెడ్డి, సీనియర్ సహా ఆచార్యులు పాల్గొన్నారు.

◆ అగ్నిప్రమాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోమ్ అంకుర విల్లాస్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైహోమ్ అంకుర విల్లాస్‌లో నివాసం ఉండే సుబ్రమణ్యం ఇంట్లో గురువారం విద్యుత్ షాట్ సర్క్యూట్ అయింది. దీంతో సోఫా, ఫ్రిజ్‌తో పాటు పలు వస్తువులు దగ్ధమయ్యాయి. శుక్రవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.